सत्यं वद - धर्मं चर

శ్రీ ప్రణవపీఠం

ఏలూరు

# ప్రణవ పద్మాకరం

శ్రావణ, శుభకృత్

ఆగష్టు 2022



'శ్రావణ' శుభాకాంక్షలు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

ఆగస్టు, 2022

# విషయ సూచిక

సంచిక-8

సంపుటి-1


| | | |
|---|---|---|
| సంపాదకీయం 2 | శ్రీ గణేశ పురాణం 3 | శ్రీ వేంకటేశ్వర రహస్యం 4 |
| బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీమతి నడుముక్కల (వద్దిపర్తి) శ్రీకలి |
| ఋషిచరిత్ర 7 | ఐశ్వర్యయోగం 8 | పురాణంలో మహిళలు 9 |
| శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక 10 | పండుగ విశేషాలు 12 | సత్సంగ సమాచారము 23 |
| బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు గారికి జయము జయము

శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యో నమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు ,శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు

https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక





ప్రణవ పీఠం

**ప్రణవ పద్మాకరం పాఠకులకు పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి**

**అనుగ్రహంతో శ్రావణమాస శుభాకాంక్షలు**

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## సంపాదకీయం

### గుడి- బడి

సకల చరాచరసృష్టిలో ఆలోచించగల శక్తి కలిగినవాడు మానవుడు మాత్రమే. భూమి మీద తాను ఉండేది స్వల్పకాలమేనన్న సత్యాన్ని మిగతా జీవులకన్నా ఎక్కువ గ్రహించినది కూడా మానవుడే. తాత్కాలికం అని తెలిసికూడా మానవుడు ఎన్నో ప్రలోభాలకు లోనౌతున్నాడు. మనస్సును అశాంతితో నింపుకొంటున్నాడు. మరలా మానసిక శాంతి కొఱకు ఎన్నో రకాల ప్రయత్నాలను చేస్తున్నాడు. ఈ ప్రయత్నాలన్నీ తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి. అరిషడ్వర్గాల ప్రలోభాల నుండి బయటపడి శాశ్వత ఆనందాన్ని పొందాలంటే మనిషి మనసు పరమాత్ముని వైపు మరలాలి. మానవుడు ఎంతో ఉన్నతంగా ఎదిగి, ఎంత ఔన్నత్యం పొందినా, మానవుని చివరిమజిలీ పరమాత్ముని సన్నిధియే అని చెప్పక తప్పదు. దానిలో భాగమే మనం జరుపుకొనే జాతరలు, ఉత్సవాలు. పండుగనాడు పరమాత్ముని తలుచుకొంటాం, అందరము కలసి ఆనందంతో ఆలోచనలు పంచుకొంటాం. ఇది మన బంధువులకు మాత్రమే పరిమితం. అలాకాక ఊరందరి కోసం, వారి ఆనందం కోసం ఆలయాలు వెలసాయి. అక్కడ పరమాత్మ ఉత్సవాలు, తిరునాళ్ళు, జాతరలు, పేరిట భక్తులందరిని తన దగ్గరకు రప్పించుకొంటాడు. ఇలాంటి ఉత్సవాలు ఏదో ఒక గ్రామానికో, ప్రాంతానికో పరిమితం కాకుండా విస్తృత పరిధిని కలిగి ఉంటాయి. పరమాత్ముని సేవతో పాటు వివిధ ప్రాంతవాసులు వారి ఆలోచనలను, సంస్కృతులను, కళారూపాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకొంటారు. అనాది నుండి మన జీవనవికాసంలో ఆలయాలది కీలక పాత్ర. సాధారణంగా ఆయా జాతుల మూలాలు, దేవాలయ ప్రాముఖ్యాన్ని అనుసరిస్తాయి. మానవజీవనపు విలువలను, వికాసాన్ని అందించేవి గుడులే (దేవాలయాలే). ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం, కలిగి రాజ్యాలను సైతం పోషించగల స్థితిలో గుడులుండేవి. మానవాభ్యున్నతికి పథనిర్దేశం చేసే స్థితిలో దేవాలయవ్యవస్థ ఉండేది. అలాంటి దేవాలయాల పవిత్రత, ప్రాధాన్యములను తెలుసుకోవాలంటే మనమందరం దేవాలయాలకు వెళ్ళాలి. వాటిని దర్శించాలి. సంరక్షించాలి, భావితరాలకు వాటినందించాలి. పిల్లపాపలతో ఆనందంగా ఆలయాన్ని దర్శించే కుటుంబాలు తక్కువయ్యాయి. చదువుల నెపంతో పిల్లలను ఇళ్ళ వద్దే వదిలిపెట్టి పెద్దలు మాత్రమే గుడికి వచ్చే పద్ధతి కాకుండా గుడి ప్రాభవ ప్రాధాన్యములను గుర్తెరిగే విధంగా పిల్లలతో కలసి దేవాలయాలను దర్శించాలి. కొత్త గుడులను నిర్మించడమే కాకుండా, ఉన్న గుడులను సైతం సంరక్షించుకొనే విధంగా సనాతన ధర్మసంస్థాపనలో పిల్లలనూ భాగస్వాములను చేయాలి. వారి నిత్యజీవితంలో దేవాలయం ఒక భాగం అవ్వాలి. **అటువంటి పవిత్ర కార్యక్రమమే నా మనస్సు నుండి పుట్టిన గుడి — బడి అనబడే కార్యక్రమం.** వారం — వారం తెలుగు రాష్ట్రాలలో నాలుగుచెఱగుల ఆలయాల పరిశుభ్రత సంరక్షణ కార్యక్రమం ఈ గుడి — బడి వల్ల జరుగుతున్నది. ఈ కార్యక్రమం ప్రపంచమంతా విస్తరిస్తున్నది. ఎంతో మంది ఇందులో పాల్గొంటున్నారు. ధర్మపీఠాలైన దేవాలయాలు పునర్వైభవం పొందుతున్నాయి. **'గురువాక్యంతు కర్తవ్యం'** అని భావించి ఈ మహాకార్యక్రమంలో పాల్గొని త్రికరణశుద్ధిగా పనిచేస్తున్న మహాత్ములైన శిష్యులకు, అనేక మంగళాశాసనాలు అందిస్తున్నాను. వీరికి నిత్యం భగవంతుని అనుగ్రహం కలుగుగాక.

వద్దిపర్తి పద్మాకర్

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## శ్రీ గణేశ పురాణం



### విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

విఘ్నేశ్వరునికి అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలాగాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారునామాలని భక్తితో తలచుకొంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు.

ఇందులో ఒక్కొక్క నామానికి గల విశేషార్థాలను, వ్యుత్పత్తులను గురించి కూడా తెలుసుకొందాం. గత నెల సంచికలో మనము విఘ్నరాజు అను నామమునకు అర్థాలను, విశేషాలను తెలుసుకున్నాం. ఈ సంచికలో ఇప్పుడు 8వ నామం గురించి తెలుసుకుందాం. ఆ నామం గణాధిపుడు

ఎనిమిదవ పేరు గణాధిపుడు — మహాశక్తిమంతములైన గణాలు కొన్ని ఉన్నాయి. వీటిని సరియైన మార్గంలో పెట్టకపోతే లోకాలను నశింపజేస్తాయి. దేవీభాగవతంలో మణిద్వీపవర్ణనం పద్మరాగమయమైన సాలం గురించి వర్ణింపబడింది. ఆ ప్రాకారశాలలో ఉండే దేవతలు ఏం చేస్తుంటారో అందులో ఇలా వివరించారు —

శ్లోII జ్వలజ్జిహ్వాననాః సర్వాః వమంతో వహ్ని ముల్బణమ్
జలం పిబామః సకలం సంహరామోవిభావసుమ్
పవనం స్తంభయామోஉద్య భక్షయామోஉఖిలం జగత్ II

(శ్రీ.దే.భా.సం.12.అ.11.శ్లో.15,16)



జగత్తులలోగల మొత్తం నీరంతా త్రాగివేస్తాము. లోకాలన్నింటినీ సంహరిస్తాము. వాయువును స్తంభింపజేస్తాము. అఖిల ప్రపంచాన్ని భక్షిస్తాము. ఇలా పలికే అనేక శక్తులు ఈ భువనబ్రహ్మాండాలలో ఉన్నాయి. అటువంటి వాటిలోని కొన్ని గణాలను కేవలం వినాయకుడు మాత్రమే అదుపులో పెట్టగలడు. అందుకే ఆయనను గణాధిపుడు అన్నారు. గణాధిపుని ఆజ్ఞ ఉంటే చాలు, వారు ఎటువంటి పనినైనా సాధిస్తారు. అత్యంత శక్తి కలిగిన గణాలను, గణాధిపుని అనుగ్రహంతో మనకు అనుకూలంగా మార్చుకోవచ్చును. శివపురాణంలో ఒక చక్కని కథ ఉన్నది. గణాలకు అధిపతి కావాలనుకొన్నవారు భూప్రదక్షిణం చేసి ముందుగా తమ దగ్గరకు రావాలనీ, అలా వచ్చిన వారికే గణాధిపత్యం, వివాహం ఈ రెండూ లభిస్తాయని పార్వతీ, పరమేశ్వరుడు వినాయకునితోనూ, షణ్ముఖునితోనూ పలికారు. అప్పుడు షణ్ముఖుడు మయూర వాహనం పై ప్రయాణమై భూప్రదక్షిణ సాగించగా, గజముఖుడు తల్లిదండ్రులకు ప్రదక్షిణ చేసాడు. వారికి చేసిన ప్రదక్షిణం భూప్రదక్షిణతో సమానం కనుక వారతడిని గణాధిపతిని చేసారు. తన బుద్ధిబలంతో గణాధిపతి అయ్యాడు గణేశుడు. ఈ నామాన్ని భక్తితో జపిస్తే అపార బుద్ధిజ్ఞానాలు కలుగుతాయని శివుడు వరమిచ్చాడు. కనుకనే ఈ నామం అద్భుతమంత్రనామం.

...ఇంకా ఉంది

*****

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీవేంకటేశ్వర విలాసాన్ని లోకానికి సులభశైలిలో అందించిన పరమాత్మ స్వరూపుడు,సమర్థగురుడు, త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి అయిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నాకు జనకులయ్యారు. తల్లి శ్రీమతి రంగవేణి కూడా వేంకటేశ్వర భక్తురాలే. అందుకే శ్రీవేంకటేశ్వరుని లీలా రహస్యాలు వ్రాసే భాగ్యం నాకు కలిగింది. సప్తగిరులు అనేక దివ్యరహస్యాలకు నిలయాలు. యుగయుగాలుగా బ్రహ్మర్షులు, దివ్యర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, మునులు, సాధకులు, యోగులు ఈ కొండపై సాధనలు చేస్తూనే ఉన్నారు. ఆ సాధనలన్నీ రహస్యాలే. కొండలలోని గుహలు రహస్యాలే. జలపాతాలు రహస్యాలే. వృక్షాలు, జంతువులు, కీటకాలు, ఇంతెందుకు ఈ కొండలోని అణువులన్నీ రహస్యాలే. ఆ రహస్యాలలో భగవంతుడు అందించిన మేరకు కొన్ని భక్తులకు అందించే ప్రయత్నం చేస్తాను. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవానికి సంబంధించిన రహస్యాలను తెలుసుకొంటున్నాం, అందులో భాగంగా తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము కొంత తెలుసుకున్నాము ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకొందాం.

## తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము

పసుపు పచ్చని వస్త్రం ధరించిన, నీలమేఘం వంటి రంగు కలిగిన ఒక మహాదివ్యపురుషుడు ఉన్నాడు. ఆయనే సర్వలోకైక ప్రభువైన శ్రీమన్నారాయణుడు. ఆయన సత్త్వగుణం కలిగిన మహాత్ముడు. శాంతమూర్తి. ముఖం కోటిసూర్యుల కాంతితో వెలిగిపోతున్నది. కానీ అందులో వేడిలేదు. ఆయన కోటిచంద్రుల చల్లదనంతో ఆహ్లాదం కలిగిస్తున్నాడు. చిఱునవ్వు ఆయనకు అలంకారం. కనుబొమ్మలు పోల్చడానికి వీలుకానివి. అందంగా ఉన్నాయి. ముక్కు చూచే కొలది చూడాలనిపించేలా ఉంది. చెవులకు ఉన్న కుండలాలు, బుగ్గలపై పడి, బుగ్గలు తళుక్కున మెరుస్తున్నాయి. పెదవులు ఎఱ్ఱగా మహాశోభతో ఉన్నాయి. ఆయన చేతులు మోకాళ్ళ వరకు ఉన్నాయి. [జానువులు అనగా మోకాళ్ళు. ఆజానుబాహువు అనగా మోకాళ్ళవరకు ఉండే పొడవైన చేతులు కలవాడు అని అర్థం] భుజాలు ఎత్తుగా దృఢంగా నున్నగా ఉన్నాయి.



వక్షఃస్థలంపై లక్ష్మీదేవి మెరిసిపోతున్నది. కుడివైపున వక్షఃస్థలంపై శ్రీవత్సలాంఛనం [లాంఛనము అనగా పుట్టుమచ్చ] ఉన్నది. కంఠం శంఖంలాగా ఉన్నది. లోతైన నాభి ఉన్నది. ఆ నాభి నుండి పుట్టిన తెల్ల తామరపూవులో నాలుగు తలలు, నాలుగు భుజాలతో ఎఱ్ఱని తామరపూవు రంగుతో, అందంగా ఉండి ఆడుకుంటున్న చిన్న పిల్లవానిగా కనబడుతున్న బ్రహ్మ కనబడుతున్నాడు. ఆ స్వామికి అనేక బాహువులు, అనేక నేత్రాలు, అనేక శిరస్సులు, అనేకపాదాలు ఉన్నాయి. ఆయన పాదాలకు మువ్వలున్న గజ్జెలు ధరించి ఉన్నాడు. ఆయన కదలినప్పుడల్లా, ఆ పాదాలకు ఉన్న గజ్జెలు, మనోహరంగా శబ్దం చేస్తున్నాయి. అపూర్వ కిరీటాలు ధరించి, నడుమునకు బంగరు మొలత్రాడు, మెడలో కౌస్తుభమణి, భుజంపై సువర్ణయజ్ఞోపవీతంతో దర్శనమిస్తున్నాడు. శంఖం, చక్రం, గద, పద్మం వంటివి చేతులలో ధరించి ఉన్నాడు. నందుడు, సునందుడు, పుణ్యశీలుడు, సుశీలుడు మున్నగు విష్ణు పరిచారకులు ఆయనను సేవిస్తున్నారు. సనకసనందనాది మునులు నారదాదులు ఆయనను స్తుతిస్తున్నారు. శ్రీ, పుష్టి, తుష్టి, కీర్తి, సరస్వతి, కాంతి, ఇల, ఊర్జ, విద్య, అవిద్య — మున్నగు మాయాశక్తులు ఆయనను స్త్రీ రూపాలు ధరించి సేవిస్తున్నాయి. అటువంటి దివ్యమంగళరూపాన్ని చూచి తొండమానుడు భక్తితో ఇలా స్తుతించాడు — "శ్రీమానినీ మానచోరా! శుభాకారా! వీరా! నీలమేఘచ్ఛాయా శరీరంతో సకల శుభలక్షణాలతో నిండిన నీ దివ్యమంగళ విగ్రహాన్ని చూచే భాగ్యం కలిగింది. ఇక నాకు వేరే ఏ కోరిక లేదు. జన్మ చరితార్థం అయ్యింది. బ్రహ్మను కన్న తండ్రీ! భూమి నీకు పాదాలు. అగ్ని నీ ముఖం. సూర్యుడు, చంద్రుడు నీకు కళ్ళు. ఆకాశం నీ నాభి. దిక్కులు నీ చెవులు. స్వర్గం నీ శిరస్సు. ఇంద్రుడు మొదలగు దేవతలు నీకు చేతులు. సముద్రాలు నీ పొట్ట. గాలి ప్రాణం. చెట్లు, లతలు నీకు రోమాలు (వెండ్రుకలు). మేఘాలు తల వెండ్రుకలు. పర్వతాలు నీ ఎముకలు, గోళ్ళు. రేయింబవళ్ళు నీ కనురెప్పలు. ప్రజాపతి జననేంద్రియం. వర్షం వీర్యం. ఈ విధంగా నీ విశ్వరూపం దర్శనమిస్తున్నది. నీవు అవ్యయుడివి.



అనేక పాదాలు, అనేక నేత్రాలు, అనేక బాహువులు కలిగి, కోటిసూర్యులకాంతితో ప్రకాశిస్తున్న నీ దివ్యమంగళరూపాన్ని చూడలేకపోతున్నాను. నీ పూర్వ రూపాన్ని చూపి నాకు ప్రశాంతతను ప్రసాదించు. అనుగ్రహించు. శ్రీ శ్రీనివాసా! రక్షించు." ఈ విధంగా బహుప్రకారాలుగా స్వామివారిని తొండమానుడు స్తుతించాడు. శ్రీనివాసుడు విశ్వరూపం విడచి, పూర్వ సౌమ్యరూపంతో దర్శనమిచ్చాడు — "నాయనా! నేను లీలామానుషరూపం ధరించి, నీకు అల్లుడిగా నటిస్తున్నాను. నాకు ఏ బంధాలు, రాగాలు, ద్వేషాలు లేవు. నేను స్త్రీ, పురుష, నపుంసక మూర్తిని కాను. పక్షులు, పశువులు మున్నగు ప్రాణిని కాను. సర్వ చైతన్యస్వరూపుడిని. నీ పూర్వపుణ్యం వలన నాకు వరుసకు మామగారివయ్యావు. నాకు భక్తుడివి అయ్యావు. నిన్ను అనుగ్రహించి కొంతకాలం నేను గృహస్థధర్మం నిర్వహిస్తాను, అని పలికి శ్రీనివాసుడు మరలా ఇలా అన్నాడు "నీనైపుణ్యంతో వేంకటాచలం పైన ఒక అద్భుత భవనం నిర్మించు. దానికి బంగారపు రేకులు తాపడం చేయించు. నవరత్నాలు అందులో తాపడం చేయించు. ఆ భవనం దేవాలయవాస్తును అనుసరించి నిర్మించు. మెట్లు, రెండు గోపురాలు దానికి ఉండాలి. సప్తద్వారాలు దానికి ఏర్పరచు. విశ్వకర్మ సూచనలు తీసుకొని వాస్తుశాస్త్రప్రకారం, శుభముహూర్తంలో ప్రతిష్ఠించాలి. ఈ కలియుగంలో నేను మాత్రమే దైవాన్ని. ఒకప్పుడు నీవు నా కోసం ఆ కొండ మీద ఒక బావిని త్రవ్వించావు. ఆ బావిని మరలా సరిచేసి బాగుచేసి, పుణ్యాన్ని పొందు. పూడుకుపోయి, పాడయిపోయిన బావిని బాగుచేసినవారికి అనంతపుణ్యం లభిస్తుంది," అని వేంకటేశ్వరుడనగానే తొండమానుడు ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని పొందాడు. స్వామివారికి పదే పదే సాష్టాంగ నమస్కారం చేసాడు.

...ఇంకా ఉంది

*****

## గురుబోధ

" మనం ప్రధానంగా గుర్తుపెట్టుకోవలసిన విషయం. ఎప్పుడయినా క్రొత్తగా కిరీటం చేయించినా, ఉంగరం చేయించినా , బంగారం వస్తువు చేయించినా ముందు దాన్ని ఆవుపాలతో శుద్ధి చేయాలి. లేదా పంచామృతాలతో శుద్ధి చేయాలి. భగవత్ సన్నిధానంలో పెట్టి, లేదా గంగాజలంతో శుద్ధి చేస్తే అప్పుడు ఆ బంగారంలో ఉన్న దోషం పోయి అది ధరించిన వాడికి శుభం ఇస్తుంది. అలా ఆవుపాలతో, లేక గంగాజలంతో బంగారాన్ని శుద్ధి చేయకుండా ధరిస్తే అది చాలా ప్రమాదం తెచ్చిపెడుతుంది. మంత్రశాస్త్ర సంప్రదాయం ప్రకారంగా పూర్వకాలంలో సువర్ణాన్ని శుద్ధి చేసి ధరించేవారు."



శ్రీ రామ జయ రామ జయ జయ రామ



# ఋషి చరిత్ర



ప్రణవ పద్మాకరం జూలై సంచిక లో అగస్త్యుడి వివాహం గురించి తెలుసుకొన్నాము. ఈ సంచికలో మరిన్ని వివరాలు తెలుసుకొందాము. వారి (అగస్త్యుడు,లోపాముద్రల) కాంతి చాలా గొప్పది, వాళ్ళు ఎప్పుడూ నవయౌవనంతో ఉంటారు. వారికి వార్ధక్యం అస్సలు ఉండదు, తపః శక్తి గల వారికి వార్ధక్యం రాదు. జరామరణాలు రాకుండా ఉండాలంటే గొప్ప సాధన చేయాలి. సాధనతో జరామరణాలు జయించవచ్చు అని నిరూపించే ఒక గొప్ప గాథ ఉన్నది. కార్తవీర్యార్జునుడివంశంలో అనగా హయ హయ వంశంలో ఒకప్పుడు కొంతమంది యువరాజులు ఉన్నారు, వారికి వేట అంటే బాగా ఇష్టం వారిలో ఒకరు ఒకరోజు గుఱ్ఱం ఎక్కి వేటకు వెళ్ళారు. కొద్ది దూరంలో జింక కనబడింది. బాణం బాగా చెవిదాక, ఆకర్ణాంతం లాగి ఆ జింకని కొట్టాడు. వెంటనే జింక కుప్పకూలి పడిపోయింది. అమ్మ బాబోయి చచ్చిపోయాను అనే కేక వినపడింది. ఇదేంటి జింకని కొడితే మనిషి అరుపులు వినిపిస్తున్నాయి అని దగ్గరకు వెళ్ళి చూస్తే, అది జింక కాదు, ఒక ఋషి కుమారుడు జింకచర్మం ధరించి వంగి దర్భలు కోసుకొంటున్నాడు. దూరం నుంచి చూసే రాజకుమారుడికి జింక వలే కనపడటంతో జింక అనుకొని బాణం వదిలాడు. ఆ బాణానికి ముని కుమారుడు గిలగిలా కొట్టుకుని క్రింద పడిపోయాడు. దానితో హయ హయ రాజ కుమారుడు చాలా బాధపడుతూ అడవికి వేటకని వచ్చి, అన్యాయంగా ఒక మునికుమారుడ్ని చంపి బ్రహ్మహత్యాపాతకం మూటకట్టుకున్నాను, బ్రహ్మహత్యా పాపానికి ప్రాయశ్చిత్తము లేదు అని బాధపడిపోయాడు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు తెలిస్తే వారు శాపం పెడతారు. కనుక నేనే నేరుగా వారి దగ్గరకు వెళ్లకుండా ఎవరైనా పెద్దవారిని వెంటపెట్టుకుని వెళ్లి వారి ద్వారా ఆ మునులను శరణుకోరడం మంచిదని ఆలోచన చేసి భయపడుతూ పరుగు పరుగున తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళాడు. జరిగిందంతా చెప్పాడు. అప్పుడు వారు ఆ హయహయ వంశంలో ఉన్న ఇంకొంతమంది పెద్దల్ని వెంటబెట్టుకుని ఆ మునులు ఉన్న ఆశ్రమం దగ్గరకు వెళ్లారు.

..ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# ఐశ్వర్య యోగం

శ్రీ మహాగణాధిపతయేనమః　　శ్రీ మాత్రేనమః　　శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితాసహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.

## 310. రమణీ [ఓం ఐం హ్రీం శ్రీం రమణ్యై నమః]

మనోహరురాలైన యువతి అనీ, శుభలక్షణాలు గల భార్య లేక గృహిణి అనీ రమణీశబ్దార్థాలు. అమ్మవారు భక్తులను ఆనందపరుస్తుంది. చంటిపిల్లలాగా వారివారి భక్తిని బట్టి వారితో ఆడుతుంది, పాడుతుంది. నవ్వుతూ, ఆడుతూ, రమింపజేస్తుందని వేదములూ, ఆదిశంకరులు కూడా అమ్మను గురించి వర్ణించారు. అమ్మవారిని తలచుకొంటే చాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అంతరార్థం.



మంత్రప్రయోగ విధానం – ఫలితం : మనస్సు ఎల్లవేళలా ప్రశాంతంగా ఉండడానికీ, మనను చూచీ, చూడగానే, ఇతరులు మన పట్ల ఆకర్షితులై, మనకు అనుకూలురు అవ్వడానికీ ఈ మంత్రాన్ని ప్రయోగించుకొనవచ్చును. 40 దినములు అమ్మవారిని మల్లెపూలతో పూజించి పాయసాన్నాన్ని నివేదించాలి. ఆ ప్రసాదాన్ని స్వీకరించాలి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

*****

"మాస సంక్రాంతి రోజు చేసిన పూజ, జపం, నామస్మరణం వలన విశేష ఫలితం వస్తుంది"



# పురాణం లో మహిళలు

## తార

రామాయణంలోని స్త్రీపాత్రలలో మరొక ముఖ్యమైన పాత్ర "తార". దూరదృష్టితో పరిస్థితులను అర్థం చేసుకొంటూ, ధైర్యంతో ఎదుర్కొనే స్త్రీగా 'తార' వినుతికెక్కింది. అందమైన తన జీవితంలో విషమపరిస్థితులేర్పడే సరికి, ఆమె ప్రదర్శించిన దూరదృష్టి, చొరవ, ప్రజ్ఞాపాటవాలు, ధైర్యస్థైర్యాలు ఎంతో గొప్పవి. సుగ్రీవునితో రెండవ సారి యుద్ధానికి వెళ్ళేముందు వాలికి ఆమె చేసిన హితబోధ, వాలిని వధించిన రామునితో ఆమె మాట్లాడిన తీరు, మహోగ్రుడై, సుగ్రీవుణ్ణి చంపడానికి వచ్చిన లక్ష్మణునితో ఆమె వ్యవహరించిన వైనం 'తార' వ్యక్తిత్వానికి మకుటాయమానమని భావించవచ్చు.

సుగ్రీవునితో మొదటిసారి యుద్ధం చేసి, తిరిగివచ్చి సేదతీరుతున్న వాలి మరలా సుగ్రీవుని సింహనాదం వినపడటం తోటే, వాలి తటాలున తల్పం దిగి యుద్ధానికి బయలుదేరాడు. అప్పుడు తార తన భర్త వాలిని యుద్ధానికి వద్దని వారిస్తూ స్వామీ! నీ కోపాన్ని విస్మరించు. నిదానంగా ఆలోచించు. నీ చేత అంతగా దెబ్బతిని పారిపోయిన సుగ్రీవుడు మరల ఇంతలా గర్జిస్తూ యుద్ధానికి వచ్చాడంటే, అతనికి ఏదైనా ఆశ్రయము దొరికి ఉండాలి. సుగ్రీవుడు సహజబుద్ధిబలసమర్థుడు. అతడు నీ బలాన్ని అంచనా వేసుకోకుండా మరలా యుద్ధానికి రాడు. సుగ్రీవునికి సహాయంగా ఇక్ష్వాకు రాకుమారులైన రామలక్ష్మణులు ఉన్నారని మన వేగులు కూడా సమాచారమిచ్చారు. అనేక మంది రాక్షసులను వారు వధించారట. అందువల్ల సుగ్రీవునితో యుద్ధం వద్దు. అతనేమి పరాయివాడుకాదు కదా? నీ తమ్ముడే, అతనికి యౌవరాజ్యాభిషేకం చేయి. నీ ప్రక్కన ఉంచుకో. అది మీ ఇద్దరికీ శ్రేయోదాయకం. స్వామీ! నా ప్రార్థన మన్నించి నీ యుద్ధప్రయత్నం విరమించుకోమని తార దూరదృష్టితో రానున్న ప్రమాదాలను గ్రహించి, తార్కికంగా వివేచించి భర్తకు హితబోధ చేసింది. కాని తార చెప్పిన మాటలను పెడచెవినబెట్టి, తారపై ఒట్టుపెట్టి, పట్టుబట్టి యుద్ధానికి బయలుదేరాడు వాలి. దుఃఖం పెల్లుబుకుతున్నా అమంగళభయంతో దానిని మనసులోనే ఆపుకొన్నది. భర్తను యుద్ధానికి సాగనంపినది. ఆవేదన నిండిన మనసుతో ఉన్న ఆమె, వాలి రామబాణానికి నేల వ్రాలాడన్న వార్తతో యుద్ధరంగానికి బయలుదేరి వెళ్ళి చూడగా అక్కడ నెత్తుటి మడుగులో కొనఊపిరితో ఉన్న వాలి ప్రక్కన ఏడుస్తున్న అంగదుడు, వాలిని చూడగానే తార బావురుమన్నది. తీవ్ర దుఃఖంతో స్పృహతప్పి పడిపోయింది. తేరుకున్న పిదప వాలి తలను తన ఒడిలోనికి తీసుకొని, స్వామీ! నీవు మహావీరుడివి. ఈ విధంగా దిక్కులేక దుమ్ములోపడి ఉన్నావా! ఎంత వైపరీత్యం. సుగ్రీవుని భార్యనపహరించి తరిమికొట్టిన పాపం ఈ రూపంగా పరిణమించింది. నా హితం వినకుండా నన్ను అనాథను చేసావని వాపోయింది. అనంతరం సుగ్రీవునితో ఇలా అన్నది. సుగ్రీవా! రాముడు తన ప్రతిజ్ఞను చెల్లించుకొన్నాడు. నీ అన్నను వధించాడు. రుమను పొంది రాజభోగాలను అనుభవించు. అని పతితో ప్రాయోపవేశం చేయాలని నిర్ణయించుకొన్నది. సాంత్వన చెప్పిన హనుమంతునితో వాలికి జరుగవలసిన సంస్కారాలు, అంగదునికి జరుగవలసిన రాజ్యాభిషేకం నిర్ణయించవలసింది, నిర్వహించవలసింది తండ్రి తరువాత తండ్రి పినతండ్రి సుగ్రీవుడు. నేను కాదు అని ఔచిత్యంతో కూడిన సమాధానం ఇచ్చినది కానీ,



అవివేకంగా మాట్లాడలేదు. అంతటి విషాదస్థితిలో కూడా ఎవరినీ నిందించకుండా రామునితో తనని కూడా వాలితోపాటు స్వర్గానికి పంపమని కోరింది. రాముడంతటివానికి తారను సమాధానపరచడం సాధ్యం కాలేదు. వాలి అంత్యక్రియలు జరిగాయి. సుగ్రీవునికి రాజ్యాభిషేకం జరిగినది. అంగదుడు యువరాజు అయ్యాడు. వానర సంప్రదాయం ప్రకారం తార సుగ్రీవుని భార్యయైనది. అంతా సవ్యంగా జరుగుతున్న సమయంలో రామునికిచ్చిన మాటను మరచిన సుగ్రీవునికి కర్తవ్యబోధచేయడానికి ఆగ్రహోదగ్రుడై వస్తున్న లక్ష్మణుడు చేసిన ధనుష్టంకారం వినబడింది. మహాపర్వతం బద్దలైనట్లుగా తోచింది. ఆ సమయంలో లక్ష్మణునికి ఎదురువెళితే సుగ్రీవునికి ఏమి జరుగుతుందో ఎఱిగిన తార సుగ్రీవుని అనుమతితో లక్ష్మణుని ఎదుట నిలచింది. ఇలా పలికింది — లక్ష్మణా! ఈ కోపం ఎందుకని? 'ఎవరిమీద' అని అడిగి ఎవరైనా నీ ఆజ్ఞ అతిక్రమించారా? అయినా దావానలం మీద ఎవరు దూకుతారని అని అన్నది. ఆమె మాటల వల్ల లక్ష్మణుని కోపం బాగా చల్లబడిపోయింది. గొంతు సవరించుకొని సుగ్రీవుడు రామకార్యం మరచాడు, శరత్కాలం వచ్చినా సీతాన్వేషణ సాగించలేదు అని అనగా తార లక్ష్మణునివైపు చూస్తూ సుగ్రీవుని మిత్ర హృదయాన్ని, కార్యాచరణ స్థితిని, సైన్యసమీకరణ యత్నాలను వివరించి కోపాన్ని ఉపసంహరించమని కొంత ఆవేశంగా అనేసరికే అగ్నిపర్వతంలా సుగ్రీవునిపై ఎగిసిపడ్డ లక్ష్మణుడు మంచుగడ్డలా మారిపోయాడు. తార వల్లే కిష్కింధ కథ సుఖాంతమైనది. ఆమె వ్యక్తిత్వం, చొరవ, నేర్పు లేకుంటే సుగ్రీవుని పరిస్థితి ఏమిటి? అందుకే వాల్మీకి మహర్షి ఆమె పాత్రను గొప్పగా తీర్చిదిద్దాడు.

*****

## స్తోత్రమాలిక

**శ్రీ ప్రణవపీఠాధీశులు, అభినవశుక, త్రిభాషామహాసహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురుదేవ విరచిత దివ్యకీర్తనం - విష్ణుపది**

పల్లవి : నారాయణా! మహేశా! వైకుంఠపురనివాసా!
నీలాంబుద ప్రకాశా! నిజభక్తహృదయవాసా!

చరణం: ఉరమందు సిరి వసింప చరణముల ధర లసింప
నినుకొలుచువారికొఱకు, విచ్చేసినావు ధరకు ||నారాయణా||

చరణం: పద్మాకరగ్రహీతా! ధూతప్రపంచభూతా!
నాశితనృలోకకష్టా! సద్భక్తభక్తితుష్టా! ||నారాయణా||

## వేదస్తుతి

వేదములు స్వయంగా అమ్మవారిని ఈ స్తోత్రంతో స్తుతించాయి. ఈ స్తోత్రాన్ని భక్తితో ఒక్కసారి అయినా విన్నా లేదా చదివినా వాళ్ళలో అమ్మవారు స్వయంగా ఉంటుందని, వారికి సర్వశుభాలు ఇస్తానని అమ్మవారు వరం ఇచ్చింది

వేదా ఊచుః

నమో దేవి మహామాయే విశ్వోత్పత్తికరే శివే |

నిర్గుణే సర్వభూతేశి మాతః శంకరకామదే |

త్వం భూమిః సర్వభూతానాం ప్రాణః ప్రాణవతాం తథా |

ధీః శ్రీః కాంతిః క్షమా శాంతిః శ్రద్ధా మేధా ధృతిః స్మృతిః |

త్వముద్గీథేఽర్ధమాత్రాసి గాయత్రీవ్యాహృతి స్తథా |

జయా చ విజయా ధాత్రీ లజ్జా కీర్తిః స్పృహా దయా |

త్వాం సంస్తుమోఽంబ భువనత్రయ సంవిధాన |

దక్షాం దయారసయుతాం జననీం జనానామ్ |

విద్యాం శివాం సకలలోకహితాం వరేణ్యాం |

వాగ్బీజ వాసనిపుణాం భవనాశకర్త్రీమ్ |

బ్రహ్మా హరః శౌరిసహస్రనేత్ర

వాగ్వహ్నిసూర్యా భువనాధినాథాః |

తే త్వత్కృతాః సంతి తతో న ముఖ్యా |

మాతా యతస్త్వం స్థిరజంగమానామ్ |

సకల భువనమేతత్ కర్తుకామా యదా త్వం |

సృజసి జనని దేవాన్ విష్ణురుద్రాజముఖ్యాన్ |

స్థితిలయజననం తైః కారయస్యేకరూపా

న ఖలు తవ కథంచిద్దేవి సంసారలేశః |

న తే రూపం వేత్తుం సకలభువనే కోఽపి నిపుణో

న నామ్నాం సంఖ్యాం తే కథితుమిహ యోగ్యోఽస్తి పురుషః |

యదల్పం కీలాలం కలయితుమశక్తః స తు నరః

కథం పారావారాకలనచతురః స్యాద్ధృతమతిః |

*****

"నేతిని కరగబెట్టి మాత్రమే హోమంలో లేదా భోజనం చేసేటప్పుడు ఉపయోగించాలి"



# పండుగ విశేషాలు

శ్రావణ, భాద్రపద మాసములను కలిపి వర్ష ఋతువు అంటారు.

శ్రావణమాసం ప్రారంభ మాసం. శ్రావణమాసం లక్ష్మీదేవికి, గౌరీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసము.

## దూర్వా గణపతి వ్రతం



1) శ్రావణమాసం శుక్లపక్షంలో మధ్యాహ్నం వరకు చతుర్థి వుంటే ఆ రోజున గణపతిని గరికతో పూజించాలి.

2) ఈ వ్రతాన్ని దూర్వాగణపతి వ్రతం అంటారు.

3) ఈరోజు తెల్లవారుజామున లేచి స్నానం చెయ్యాలి .

4) స్నానానంతరం మొట్టికాయలు నెత్తికి మూడుసార్లు కొట్టుకోవాలి. ఆలయంలో అయితే విగ్రహాలను, ఇంట్లో అయితే హరిద్రా గణపతిని, లేదా అర్క గణపతిని, లేదా శిలా విగ్రహములను పూజించాలి.

5) గణపతిని 108 నామాలతో కానీ, లేదా గణపతి యొక్క పన్నెండు నామాలతో కానీ, లేదా 27 నామాలతో కానీ గరికతో పూజించాలి.

6) 3, 9, 27 సంఖ్యలలో ఉండ్రాళ్ళు నివేదించాలి. ఇలా చేస్తే ఈ మాసంలో వచ్చే అన్ని విఘ్నాలు తొలగిపోతాయి.

7) చేతిలో అక్షతలు తీసుకొని గణపతి చుట్టూ ప్రదక్షిణ చేసి, సాష్టాంగ నమస్కారం చేసి, అక్షతలను గణపతికి వేసి, ఆ అక్షతలను శిరస్సుపై చల్లుకొంటే సకల శుభాలూ కలుగుతాయి.

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## గరుడ పంచమి లేదా నాగపంచమి

1) గరుత్మంతుడు నాగుల మీద పగబట్టి ఇంద్రుని దగ్గర, విష్ణువు దగ్గర వరం పొంది, పాములను తినేసేవాడు, దీనివలన నాగజాతి అంతరించి పోయే పరిస్థితి ఏర్పడింది.

2) నాగజాతి ప్రముఖులు వాసుకి తదితరులు గరుత్మంతుని వద్దకు వెళ్లి, మా నాగులను పగబట్టి తింటున్నావు ఇలా అయితే మా నాగజాతి కొంతకాలానికి నశిస్తుంది, మా జాతిని రక్షించుకోవడానికి నీతో ఒడంబడిక చేసుకుంటాం అన్నారు.

3) వాసుకి, ఆదిశేషుని పైన ఉన్న గౌరవంతో గరుత్మంతుడు అంగీకరించాడు.

4) ప్రతిమాసం ఒక తిథినాడు మాలో ఒక పామును నీకు ఆహారంగా పంపిస్తాము, పాముతో పాటు కొంత అన్నం కూడా పంపుతాము, మేము పంపే పాము మరియు ఆహారమును స్వీకరించవలసిందిగా నాగులు కోరారు.

5) ఈ ఒడంబడిక వల్ల నెలకు ఒక పాము మరణిస్తుంది, నీకు ఇంద్రుడు, విష్ణువు ఇచ్చిన వరములు కూడా భ్రష్టు కాకుండా ఉంటాయి, కావున దయతో అంగీకరించమని నాగులు అభ్యర్థించారు. అందుకు గరుత్మంతుడు కూడా సమ్మతించాడు.

6) అలా వాసుకి, గరుత్మంతునికి ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి మాసమునందు ఒక తిథినాడు పాముతో పాటు చలివిడి, చిమ్మిలి గరుత్మంతునికి ఆహారంగా పంపేవారు.

7) నాగులకు మరియు గరుత్మంతునికి శ్రావణ మాస శుక్లపక్షం పంచమి తిథి నాడు ఒప్పందం కుదిరింది. ఈ తిథినే నాగపంచమి అని, గరుడపంచమి అని పిలుస్తారు.

8) గరుత్మంతుని ఒప్పందానికి మెచ్చుకున్న శ్రీమహావిష్ణువు శ్రావణ శుక్ల పంచమి నాడు గరుత్మంతుడిని, గరుత్మంతుని నామాలను తలుచుకొని పానకం నివేదించాలని, నాగ దేవతలను కూడా చిమ్మిలి, చలివిడి నివేదించి పూజించాలని వరమిచ్చాడు.

9) ఇలా చేయటంవల్ల నాగ దోషాలు, నాగ బాధలు, పక్షి దోషాలు, అపశకునం, పక్షుల వల్ల కలిగే దోషాలు పోతాయి అని విష్ణువు వరం ఇచ్చాడు.

★★★★★





## వరలక్ష్మీ వ్రతం

1) శ్రావణ మాస పూర్ణిమకి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీవ్రతం.

2) ప్రయాగలో ఋషులు ఒక యాగం చేసారు, నారద మహర్షి ఒక రోజు వచ్చి త్రిమూర్తులలో యాగ ఫలితాన్ని



ఎవరికి ధారబోస్తున్నారు అని ప్రశ్నించాడు. అప్పడు తామింకా ఆలోచించలేదు, అని ఋషులు బదులు ఇచ్చారు.

3) త్రిమూర్తులలో ఒకరికి ధారపోయాలని నిర్ణయించారు.

4) భృగు మహర్షి, త్రిమూర్తులను పరీక్షించి వారిలో ఒకరికి ధారబోయాలని నిర్ణయించాడు, అందులో భాగంగా వైకుంఠమునకు వెళ్లాడు.

5) భృగు మహర్షి తనను వైకుంఠంలో అవమానించారని, విష్ణువును వక్షఃస్థలం పైన తన వామపాదంతో తన్నాడు.

6) తన నివాసస్థలం అయిన విష్ణు వక్షఃస్థలం పై జరిగిన సంఘటనకు ఆగ్రహించక, భృగు మహర్షికి విష్ణువు సేవ చేసాడని కోపంతో, లక్ష్మీదేవి వైకుంఠం వదిలి భూలోకములో కరవీరపురమునకు వచ్చింది.

7) ఈ కథ స్వాయంభువు మనువు కాలంలో జరిగింది.



8) లక్ష్మీదేవిని అవమానించిన భృగువు పాప ప్రాయశ్చిత్తం కోసం కరవీరపురం వెళ్లి స్వయంభూ రూపంలో కొలువై ఉన్న లక్ష్మీదేవి కోసం తపస్సు చేసాడు.

9) అమ్మ ప్రత్యక్షమై వరము కోరుకోమన్నది. లక్ష్మీదేవిని తనకు కూతురుగా జన్మించవలసిందిగా అమ్మను వరం కోరాడు. ఆ తరువాత నిన్ను విష్ణువుకిచ్చి వివాహం చేస్తా అన్నాడు.

10) అమ్మ "తథాస్తు" అన్నది. ఐదు శుక్రవారముల పాటు విడిచిపెట్టకుండా పూజించి, ఆవుపాలతో అభిషేకించి, ఆవుపాల పాయసం నివేదించమన్నది. భృగు మహర్షి అలానే చేసాడు.

11) భృగుమహర్షికి, ఖ్యాతికి శ్రావణమాస పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు లక్ష్మీదేవి జన్మించింది. వరములిచ్చే లక్ష్మీదేవి జన్మించడం వలన వరలక్ష్మి అనే పేరు వచ్చింది.

11) భృగు మహర్షి కూతురు అవడం వల్ల అమ్మకి భార్గవి అని పేరు వచ్చింది. శ్రావణ మాస శుక్ల పక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారంనాడే విష్ణువుకిచ్చి అమ్మను వివాహం చేసాడు.

12) వివాహానంతరం సాయంత్రం లక్ష్మీనారాయణులను ప్రత్యక్షంగా ఆసనంపై కూర్చోబెట్టి భృగుమహర్షి వరలక్ష్మీ వ్రతం ఆచరించాడు.

## ఆచరించవలసిన విధి:

1) ఈ రోజు భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవిని పూజించాలి. వరలక్ష్మీవ్రతం చేసిన వారికి సకల శుభములు కలిగి అమ్మవారి దివ్య కటాక్షం లభిస్తుంది.

2) వరలక్ష్మి వ్రతాన్ని స్త్రీలు, పురుషులు అందరూ చేసుకోవాలి. స్త్రీలైతే తప్పకుండా వరలక్ష్మీ పూజ చేసుకోవాలి.

3) పురుషుడు చేస్తే ధనం పెరుగుతుంది, భార్యాభర్తలు ఆనందంగా ఉంటారు. స్త్రీ చేస్తే సౌభాగ్యం కలుగుతుంది. ఇద్దరూ కలసి చేస్తే జీవితకాలం సంతోషం కలుగుతుంది.

4) ఉదయం లేచి తలారా స్నానం చేయాలి. శుచిగా ఉన్న వస్త్రాలు కట్టుకోవాలి.

5) ఒక మండపం పెట్టుకొని, నూతన వస్త్రాన్ని పరచి, కలశస్థాపన చేయాలి. కలశంలో అమ్మవారిని ఆవాహనం చేసి షోడశోపచార పూజ చేయాలి. చారుమతి కథ, భృగు మహర్షి కథ వినాలి.

6) పాయసాన్నం, దధ్యోదనం, పులిహోర నివేదించాలి. తాము తిని ఇతరులకు పెట్టాలి. ఇలా చేసిన వారికి జీవితంలో అన్న పానీయాలకు లోటు ఉండదు.

7) కొబ్బరికాయ ఒకటికి తక్కువ కాకుండ కొట్టి, పానకం, వడపప్పు, చలివిడి నివేదించాలి.

8) ముత్తైదువలకు పూజ చేసి గాజులు, వస్త్రములు, కాటుక, తాంబూలము ఇవ్వాలి.

9) బ్రహ్మచర్య దీక్ష తప్పనిసరిగా పాటించాలి. నేల పైన పడుకోవాలి. కుదరని వారు కొత్త దుప్పటి పరచుకొని చెక్క పైన నిదురించవచ్చు. సాయంత్రం వేళ లక్ష్మీదేవి యొక్క గుడిలో ప్రదక్షిణలు చేయాలి.

10)లక్ష్మీనారాయణులు గురుదంపతుల రూపంలో ఉంటారు. గురుదంపతులను పూజించి ప్రదక్షిణ చేయాలి. కుదరని వారు కనీసం గురువులపటం పెట్టుకుని పూజించాలి.

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



11) అమ్మవారిని పసుపుకొమ్ములతో అర్చించాలి, శ్రీ సూక్తం పారాయణం తప్పకుండా చేయాలి లేదా వినాలి.

12) అమ్మవారిని అష్టోత్తరశత నామాలతో, బిల్వ పత్రాలతో పూజించాలి. ఇలా చేయటం వల్ల సంపదలకు లోటు ఉండదు.

13) శక్తిని అనుసరించి సువర్ణ, రజత దానాలు చేయాలి, అన్నదానం చేయాలి. కప్పుకోవడానికి పనికొచ్చే దుప్పటి కానీ, శాలువా కానీ మహానుభావులయిన గురువులకు దానం చేస్తే, భార్యాభర్తలు ఎప్పుడూ ఐకమత్యంతో జీవిస్తారు.

## గమనిక:

1) వ్రతమును ఈరోజు (పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం) ఆచరించలేకపోతే, చివరి శుక్రవారం చేసుకోవచ్చు.

2) సంపదలు అనగా ఒక్క ధనము మాత్రమే కాదు, సంతానం, ఆరోగ్యం, విద్య తదితరములు కూడా.

3) వ్రతముల నాడు తలంటు స్నానం పనికిరాదు.

★★★★★

## మంగళగౌరీవ్రతం..

1) పార్వతీ అమ్మవారు అనేక వర్ణములు కలిగి ఉండేది. పార్వతీ అవతారంలో అమ్మ నల్ల కలువ వర్ణంలో ఉండేది. ఒకసారి శివుడు పార్వతీ అమ్మవారిని సతీదేవిలా కాకుండా నలుపు వర్ణంలో ఉన్నావని అన్నాడు. అలిగిన అమ్మవారు తపస్సుతో నలుపు వర్ణాన్ని విడిచి గౌరవర్ణం (తెలుపు రంగు) ధరించింది. అమ్మవారు గౌరవర్ణం ధరించిన రోజు శ్రావణమాసంలో వచ్చే మొదటి మంగళవారం. గౌర వర్ణంలో ఉండటం వలన అమ్మవారిని "గౌరి" అన్నారు.

2) ఒకసారి శివ దంపతులు మానవులను రక్షించాలని అనుకున్నారు. గౌరీదేవి శ్రావణమాసంలో ప్రతి మంగళవారం నాడు భూసంచారం చేసి, తాను చెప్పిన విధంగా చేసిన స్త్రీలను అనుగ్రహిస్తాను అని అన్నది.

3) భూలోకంలో అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర ద్వారా మంగళగౌరీ వ్రతాన్ని అమ్మ వ్యాపింపచేసింది.

4) ఈ వ్రతం చేసిన వారింట్లో గౌరీదేవి కొలువై ఉంటుంది. స్త్రీలకు శాశ్వతంగా ముత్తైదువగా ఉండే వరాన్నిస్తుంది.





## చేయవలిసిన విధులు:

1) కొత్త పెళ్లికూతురు తప్పనిసరిగా శ్రావణమంగళవార నోము నోచుకోవాలి. పెళ్ళైన దగ్గరినుండి ఐదేళ్లు విడిచిపెట్టకుండా చేసుకోవాలి.

2) ఉదయాన్నే లేచి తలారా స్నానం చేసి శుభ్రమైన వస్త్రాన్ని ధరించాలి, బొట్టు పెట్టుకోవాలి.

3) గణపతిని పూజించాలి. తరువాత మళ్ళీ శుభ్రవస్త్రం ధరించాలి. మంగళగౌరీ వ్రతమునకు కట్టుకొన్న వస్త్రాలను మళ్ళీ మరొక వ్రతమునకు వాడకూడదు.

4) మంగళవారం అమ్మను పూజించాలి. గౌరీదేవికి షోడశోపచారాలు చేయాలి, వ్రతకథ చదవాలి, అమ్మని భక్తితో పూజించాలి. సాయంత్రం లేదా పూజ అనంతరం పగలు కానీ, శనగలు వాయనం ఇవ్వాలి. ముత్తైదువలకు పసుపు, గంధం పూసి తమలపాకులు, వక్కలు, అరటిపండ్లు, గాజులు, వస్త్రములతో తాంబూలం ఇవ్వాలి.

5) నువ్వుల నూనె లేదా ఆవునెయ్యి తో దీపం వెలిగించాలి, బాగా పొగ వచ్చేటట్టు చేసి ఇనుపగరిట పెట్టి కాటుక పట్టాలి. ఆ కాటుకను తాము పెట్టుకొని ముత్తైదువలకు ఇవ్వాలి. తాజా ఆవు నెయ్యినే వాడాలి, తాజా ఆవు నెయ్యి దొరకనప్పడు తాజా నువ్వుల నునె మాత్రమే కాటుక పట్టడానికి వాడాలి.

6) గురుదంపతులను, పెద్ద దంపతులను పూజించాలి. ఈ వ్రతం చేసిన వారికి అమ్మ అనుగ్రహం వల్ల చర్మమునుకు సంబంధించిన రోగాలు పోయి కాంతివంతం అవుతుంది.

★★★★★

## శ్రావణ పౌర్ణమి

1) శ్రావణ మాసం లో అపూర్వ దినం శ్రావణ పౌర్ణమి.

2) **శ్రావణ పౌర్ణమిని రక్షాబంధన్ పౌర్ణమి అని, హయగ్రీవ పౌర్ణమి అని, జంధ్యాల పౌర్ణమి అని అంటారు.**

3) ఒకప్పడు సోమకుడు (సోమకాసురుడు) అనే రాక్షసుడు ఉండేవాడు. బుర్రలో జ్ఞానాన్ని లాగేయటం ఇతనికున్న వరం. సోమకుడినే హయగ్రీవుడు అని కూడా అంటారు. బ్రహ్మజ్ఞానాన్ని కూడా అపహరించే శక్తి కలిగినవాడు ఈ సోమకాసురుడు. ఈ వరాన్ని బ్రహ్మే ఇచ్చాడు. బ్రహ్మని రక్షించటానికి విష్ణువు మత్స్యావతారం ధరించి వధించాడు.

6) సోమకుడు హయగ్రీవరూపం ధరించాడు. విష్ణువు హయగ్రీవ అవతారమెత్తి, హయగ్రీవుడిని వధించి వేద జ్ఞానాన్ని తిరిగి బ్రహ్మకు ఇచ్చాడు.

7) శ్రావణ పౌర్ణమి నాడే విష్ణువు హయగ్రీవ అవతారం ఎత్తి, వేదములను సంరక్షించాడు, అందుకే హయగ్రీవ పౌర్ణమి అంటారు.

8) ఈ దినమున ప్రొద్దునే లేచి స్నానం చేయాలి. హయగ్రీవుడ్ని ఆవాహనం చేసి, శంఖ పుష్పాలతో లేదా తెల్లని పుష్పాలతో పూజించాలి.

9) హయగ్రీవుడు జ్ఞానానందస్వరూపుడు. పిల్లలు హయగ్రీవుని పూజించటం వల్ల విద్యాభివృద్ధి కలుగుతుంది.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




10) పౌర్ణమి నాడు హయగ్రీవ పటం కానీ, విగ్రహం కానీ పెట్టి పిల్లలతో పూజ చేయించాలి. హయగ్రీవ మంత్రాన్ని చెప్పించాలి. ఇలా చేయటం వల్ల పిల్లలో జ్ఞానం పెరుగుతుంది, మాతృ, పితృ భక్తి పెరుగుతుంది. పిల్లలు ఉత్తములుగా మారుతారు.

11) ఈ రోజు ఏడు తోరములు (ముడి) కలిగిన దారం తయారుచేసి గౌరీ దేవి ముందు పెట్టాలి. యథాశక్తిగా పూజించాలి, పసుపు కుంకుమ బొట్లు పెట్టాలి. పూజ అయ్యాక స్త్రీలైనా పురుషులైనా కుడి చేతికి తోరమును కట్టుకోవాలి. ఇలా చేయటం వల్ల విజయం లభిస్తుంది, శత్రుబాధ తగ్గుతుంది.

12) ఈ రోజు తప్పనిసరిగా జంధ్యం మార్చుకోవాలి. ఈ రోజు నదులలో కానీ, చెరువులో కానీ, నూతిలో కానీ, బావుల వద్దకానీ స్నానం చేయాలి. కుదరకపోతే ఇంట్లో కూడా చేయవచ్చు, నీళ్లలో ఆవుపాలు కానీ పెరుగు కానీ చిటికెడు పసుపు కానీ కలుపుకొని నీటి పై చేయి వేసి గంగ అని ముమ్మారు పలికి స్నానం చేయాలి. స్నానానంతరం యజ్ఞోపవీతం మార్చుకోవాలి. శుక్రవారం అయితే పాత యజ్ఞోపవీతాన్ని శనివారం తీసివేయాలి.

13) ఈ రోజు అందరూ గాయత్రీజపం చేయాలి. ఉపనయనం లేని వారు, స్త్రీలు చేయటానికి దేవీభాగవతంలో శ్లోకం ఉంది. గాయత్రీ జపం వల్ల అనేక యజ్ఞములు, యాగములు, దానములు చేసిన ఫలితం వస్తుంది.

దేవీభాగవతం లోని శ్లోకం:

శ్లో|| యోదేవ స్సవితాஉస్మాకం ధియో ధర్మాదిగోచరాః |

ప్రేరయేత్తస్య యద్భర్గః తద్వరేణ్య ముపాస్మహే ||

14) ఈ రోజు ఒక్క సారి గాయత్రీ మంత్రం జపిస్తే వేయి సార్లు జపించిన ఫలితం దక్కుతుంది. ఈరోజు అందరూ వేదం శ్రవణం చేయాలి. వేదపండితులకు దానం చేయాలి.

15) అందరూ ఈ రోజున గాయత్రీమాతని భక్తితో పూజించాలి. గాయత్రీమాత భూలోక సంచారానికి వచ్చింది ఈ శ్రావణ పౌర్ణమి నాడే. గాయత్రీ సహస్రనామ స్తోత్రం చదవాలి. ఈ రోజు అమ్మవారిని కుంకుమతో పూజించి, ప్రదక్షిణ చేయాలి. గురుపత్నికి కానీ లేదా ముత్తైదువకు కానీ చీర సమర్పించాలి.

16) రక్షా బంధన్ పౌర్ణమి కూడా కాబట్టి, సోదరునికి సోదరి హరినామాన్ని స్మరిస్తూ రక్షా బంధనం కట్టాలి.

i) ఇంద్రుని అపచారం వల్ల దూర్వాస మహర్షి శాపం వల్ల లక్ష్మి సముద్రంలో కలిసిపోయింది. క్షీరసాగరమథనం వల్ల రేవంతుడు, ఆ తర్వాత లక్ష్మి పుట్టారు. అందువలన రేవంతుడు లక్ష్మికి సోదరుడు అయ్యాడు.





ii) ఒకసారి లక్ష్మి దర్శనార్థం రేవంతుడు వైకుంఠం వచ్చాడు, వస్తున్న సోదరుడిని చూస్తున్న లక్ష్మిని విష్ణువు మూడు సార్లు పిలిచినా పట్టించుకోలేదు. అప్పుడు విష్ణువు ఆగ్రహించి లక్ష్మిని గుఱ్ఱం అయిపోమని శపించాడు.

iii) శాపానికి కారణమున్నదని చెప్పిన విష్ణువు, సంతానం కలిగాక శాపవిముక్తి కలుగుతుందని అన్నాడు. కొంత కాలానికి విష్ణువు కూడా ఒక గుఱ్ఱం అయ్యాడు. గుఱ్ఱం రూపంలో లక్ష్మీనారాయణులకు పుట్టిన సంతానానికి హయహయుడు అని పేరు వచ్చింది.

iv) శ్రావణపౌర్ణమి నాడు అమ్మకు సంతానం కలిగి శాపవిముక్తి కలిగింది.

v) లక్ష్మీదేవి విష్ణువుతో, స్వామీ శాపవిమోచనం కలిగింది కానీ ఇక నా సోదరుడు నన్ను చూడటానికి రాడు అన్నది. సోదరుడికి, సోదరికి బంధం ఉండటానికి మంచి మార్గం చూపించండి అని అన్నది.

vi) నీకు శాపవిమోచనమైన ఈ శ్రావణపౌర్ణమిని రక్షా బంధన పౌర్ణమిగా మారుస్తున్నా అని విష్ణువు అన్నాడు. ఈ రోజును సోదరసంబంధమైన రక్షాబంధన ఉత్సవంగా మారుస్తున్నా అని వరమిచ్చాడు. ఈ రోజున నీవు వెళ్లి నీ సోదరుడు రేవంతుడికి రక్షా బంధనం కట్టు. రక్షా బంధనం కట్టేటప్పుడు హరి నామాన్ని తలుచుకోవాలి అన్నాడు. అప్పటి నుండి రక్షా బంధన ఉత్సవం మొదలైంది.

*****

## కృష్ణాష్టమి



1) సకల లోకేశ్వరుడు, ఆకర్షణ స్వరూపుడు, అయిన కృష్ణుడి యొక్క ఆవిర్భావం జరిగిన రోజు శ్రావణ మాసం, కృష్ణపక్షం, అష్టమీతిథి.

౨) ఒకప్పుడు భూమండలంలో పాపాత్ములు పెరిగిపోయారు, రాక్షసులు భూలోకంలో మహారాజుల రూపం ధరించారు. కంసుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు వీరందరూ రాక్షసులు. కాలనేమి అనేవాడు కంసుడిగా పుట్టాడు, కలిపురుషుని అంశతో దుర్యోధనుడు పుట్టాడు.

3) భూమి ఈ పాపాత్ములందర్నీ భరించలేక ఓ గోవు రూపం ధరించి బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, కన్నీరుమున్నీరుగా విలపించింది. బ్రహ్మను రక్షించమని కోరింది. సత్యవంతులు ఎంతమంది ఉన్నా నేను భరిస్తాను, కానీ ఒక్క పాపాత్ముడినైనా నేను భరించలేను అన్నది.





4) భూమిని ఓదార్చి, దేవతలందరితో కలిసి వైకుంఠానికి వెళ్ళాడు బ్రహ్మ, అక్కడ విష్ణు భగవానుడిని ప్రార్థించాడు. వైకుంఠంలో విష్ణువు బ్రహ్మకు దర్శనం ఇవ్వలేదు, అప్పుడు కళ్ళు మూసుకొని పురుషసూక్తంతో విష్ణువును ప్రార్థించాడు. అప్పుడు బ్రహ్మకు కేవలం మాటలు మాత్రమే వినబడ్డాయి.

5) భూభారాన్ని తగ్గించడానికి విష్ణువు ప్రణాళిక వేసుకొన్నాడు, త్వరలో వసుదేవుని ఇంట పుట్టబోతున్నా అన్నాడు భగవంతుడు శ్రీమన్నారాయణుడు.

6) కృష్ణుడికి సేవ చేయడం కోసం దేవతలు యాదవులుగా పుడతారు, ఆదిశేషుడు బలరాముడు అనే రూపంలో అవతరిస్తాడు అని చెప్పాడు.

7) ప్రపంచం మాయ చేతిలో కీలు బొమ్మ, ఆ మాయకు వైష్ణవమాయ అని పేరు, ఆ యోగమాయ విష్ణువుకు సాయం చేయడానికి విష్ణుమాయగా యశోదాదేవికి అదే సమయంలో జన్మిస్తుంది.

8) కృష్ణుడు నూటపాతికేళ్ళు ఉంటాడు, ధర్మసంస్థాపన చేస్తాడు అని చెప్పాక భూదేవి వెళ్ళిపోయింది.

9) అష్టమగర్భంలో దేవకి – వసుదేవులకు స్వామివారు ఆవిర్భవించారు, అదే సమయంలో యశోద గర్భంలో యోగమాయ ప్రవేశించింది.

10) చెరసాలలో దేవకీగర్భంలో ఉన్న కృష్ణుడ్ని ప్రార్థించడానికి దేవతలందరూ వెళ్లారు. మాతృగర్భం నుండి రమ్మని కృష్ణుణ్ణి ప్రార్థించారు.

11) శ్రావణ మాసం కృష్ణపక్ష అష్టమీ తిథి వచ్చింది, గ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు, నక్షత్రాలు భద్రస్థితిలో ఉన్నప్పుడు, ధర్మసంస్థాపన చేయగలిగేవాడు అయినటువంటి కృష్ణుడు ఆవిర్భవించాడు.

12) అర్జునుడికి రథసారథియై, భగవద్గీత అనే శాస్త్రాన్ని మానవాళికి అందించాడు శ్రీకృష్ణుడు. అందుకు జగద్గురువు అయ్యాడు.

## చేయవలసిన విధులు:

1) ఈరోజు ఉదయాన్నే బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేవాలి, తలారా స్నానం చేయాలి. భక్తితో కృష్ణుడి యొక్క పటం కానీ విగ్రహంకానీ పెట్టుకొని యథాశక్తిగా పూజించాలి.

2) భగవంతుడు కృష్ణుడు భక్తితో ఏమాత్రం అలంకారాన్ని సమర్పించినా స్వీకరిస్తాడు. భక్తితో ఫలం, పుష్పం, పత్రం సమర్పిస్తే ఆ భగవంతుడు స్వీకరిస్తాడు.

3) కృష్ణుని విగ్రహం ముందు పెట్టుకొని షోడశోపచార పూజలు చేయాలి, తులసీదళాలతో పూజించాలి.

4) మంచి ఉద్యోగం కోసం కృష్ణాష్టమి నాడు తులసీదళాలతో పూజించాలి. కృష్ణుడికి తాజా వెన్న సమర్పించాలి. కృష్ణాష్టమి నాడు కృష్ణుడికి ఆవుపాలతో చేసిన పాయసం నివేదిస్తే, ఎటువంటి అనారోగ్యం దరిచేరదు.

5) సాయంత్రం కృష్ణ మందిరానికి వెళ్లి కృష్ణదర్శనం చేసుకోవాలి. గురువుగారికి ప్రదక్షిణ చేసి గురువుగారికి పూజ చేయాలి. కృష్ణాష్టమి నాడు ఉట్టి కొట్టే కార్యక్రమం చేయాలి. ఈరోజు అందరూ తప్పకుండా గోసేవ చేయాలి.

★★★★★

## భాద్రపద శుక్ల తృతీయ

"భాద్రపద శుక్ల తృతీయ" ఇది వరాహ జయంతి, ఈరోజు వరాహస్వామి వారిని తలుచుకోవాలి. ఆయన్ని తెల్లని పూలతో పూజ చేసినా, భూదానం చేసినా, వెండి దానం చేసినా సకల శుభాలు కలుగుతాయి.

★★★★★

## భాద్రపద శుక్ల చతుర్థి "వినాయక చతుర్థి"

1)'ఆదౌ పూజ్యో గణాధిపః' అని ఇంచుమించుగా పురాణేతిహాసాలు అన్నీ చెబుతున్నాయి. మొదటి పూజ గణపతికే చేయాలి.

2) గణపతి ఎప్పుడూ ఉన్నాడు. లోకశ్రేయస్సు కోసం అవతరించిన దాన్ని వినాయకచతుర్థి అన్నారు. ఒక కల్పంలో భాద్రపద మాసంలో శుక్ల పక్షంలో చతుర్థి నాడు ఆవిర్భవించాడు. ఈ తిథి నాడు ఉదయమే లేచి తలారా స్నానము చేసి సంధ్యావందనాది కార్యక్రమాలు చేసి ఆ తరువాత మట్టితో టి విఘ్నేశ్వరుడి యొక్క ప్రతిమను చేయండి. మట్టి ప్రతిమను పూజించాలి అని పదేపదే మన పురాణాలు చెబుతున్నాయి. అందులోకి విఘ్నేశ్వరుడిని ఆవాహన చేయాలి. పెద్ద పెద్ద విగ్రహాలు ఎన్ని. పెట్టినా తప్పనిసరిగా చిన్న ప్రతిమ ఉండాలి. నిమజ్జనం చేసేటప్పుడు ఎన్ని రకాల ప్రతిమలు ఉన్నప్పటికీ మట్టి బొమ్మ లేకపోతే ఆ నిమజ్జనం వ్యర్థమైపోతుంది.



3) గణాధిపత్యం లభించాలంటే విఘ్నేశ్వరుడికి, కుమారస్వామికి పోటీ వచ్చింది. ఆ పోటీలో విఘ్నేశ్వరుడు తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేశాడు.భూప్రదక్షిణ సమస్త లోక ప్రదక్షిణ తో సమానం గనుక తెలివితేటలతో సమస్త లోక ప్రదక్షిణ చేసిన పుణ్యం పొంది తద్వారా గణాధిపతి అయి సిద్ధి, బుద్ధి లకు భర్త అయ్యాడు.

4) ఆయనికి ఉండ్రాళ్ళు నైవేద్యం పెట్టాలి.కథా అక్షతలు వేసుకోవాలి.కథ వింటున్నప్పుడు చేతిలో అక్షతలు వేసుకోవాలి. కథ అయ్యాక విగ్రహం దగ్గర వేసి అక్షతలు నెత్తి మీద వేసుకోవాలి.అలా అక్షతలు వేసుకోకుండా చంద్రుడిని చూస్తే నీలాపనిందలు వస్తాయి.


5) విఘ్నేశ్వరుడు మోదక ప్రియుడు.మోదకము అంటే లడ్డు.ఉత్తర్ భారత్ వాళ్ళు తీపి లడ్డూలు తయారు చేస్తారు. మోదకము అంటే ఆవిరితో తయారు అయినటువంటి బియ్యపురవ్వతో తయారు చేసినవి కుడుములను కూడా మోదకములు అంటారు. మన తెలుగు వాళ్ళు కుడుములు పెడతారు. రెండూ శాస్త్రమే. కుడుములు నివేదన చేసి ప్రసాదంగా తినాలి.

6) విఘ్నేశ్వరుడి పూజలో ప్రత్యేకత ఏమిటంటే మనకి మనమే మొట్టికాయలు వేసుకుంటే మహాపాపాలు అన్నీ తొలగిపోతాయి. ఆయనకి ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసిన మహా ఫలితం వస్తుంది.

7) ఒక పుస్తకం కానీ, పలక కానీ దాని మీద 'ఓం' కారం రాసి విఘ్నేశ్వరుడి దగ్గర పెట్టి పుస్తకాలు వాడుకుంటే చదువు బాగా పెరుగుతుంది. విఘ్నేశ్వరుడి గురించి "భక్తి ప్రియో గణేశః" అని శివపురాణం చెబుతున్నది. భక్తి అంటే ఆయనకి చాలా ఇష్టం. ఇలా భక్తులపై విఘ్నేశ్వరుడిని పూజించి కథా అక్షతలు శిరస్సున వేసుకుంటే ఆ సంవత్సరమంతా విఘ్నాలు నుంచి బయటపడతాము.

★★★★★

## సత్సంగ సమాచారం




శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ గురుభ్యోనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మ శ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారికి

జయము జయము

భక్తులను భగవంతుడి దగ్గరకు చేర్చాలని సంకల్పించి భూలోక మణిద్వీపం అయిన శ్రీ ప్రణవపీఠం స్థాపించారు పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. శుక మహర్షి తరువాత కలియుగంలో పద్దెనిమిది పురాణాలతో పాటు శృతులు, స్మృతులు, సంహితలు మన అందరికీ అందించారు, అందిస్తున్నారు పూజ్య గురుదేవులు. దాదాపు మూడు వందల నలభై సార్లు భాగవత సప్తాహం నిర్వహించి, బెంగళూరులో 340 వ భాగవత సప్తాహమును కృష్ణాష్టమి వెనువెంటనే 2022, ఆగష్టు నెలలో నిర్వహించబోతున్నారు. కరోనా మహమ్మారి కష్టకాలంలో భక్తుల కోసం అనేక హోమాలు నిర్వహించారు. లోకహితం, జనహితం కొఱకు ఆవిర్భవించిన భగవద్స్వరూపులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. పూజ్య గురుదేవులు అవతరించిన ఈ



కాలంలో మనందరం ఉండటం మన అదృష్టం. మారుతున్న పరిస్థితి అనుసరించి సాంకేతికతను అందిపుచ్చుకొని గురు వాక్యాన్ని, గురుబోధని యూట్యూబ్ ద్వారా విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి అందించాలనే సంకల్పంతో శ్రీ జగదీష్ కోడె గారు, శ్రీ విశ్వనాథ్ నిడుముక్కల గారి సూచనలతో శ్రీ హరినాథ్ గారి ఆధ్వర్యవంలో గత 5 సంవత్సరాలుగా Bramhasri Vaddiparti Padmaakar Official You Tube ఛానల్ ను నిర్వహిస్తున్నారు. 3,300 వీడియోలు, లక్ష ఇరవై ఎనిమిది వేలకు పైగా సబ్స్క్రయిబర్లు, నాలుగు కోట్ల ఇరవై లక్షలకు పైగా వీక్షణలతో శ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి youtube ఛానల్ అగ్రస్థానం లో ఉన్నది. ఈ ఛానల్ ద్వారా ప్రణవపీఠ దసరా మహోత్సవములు, గురుదేవుల పురాణ ప్రవచనాలు, విశేష దినములలో జరుగు ఉత్సవాలు అన్నీ ప్రత్యక్షప్రసారం చేస్తుంటారు. ఈ ప్రత్యక్షప్రసార కార్యక్రమం ద్వారా గురుభక్తులు అందరికీ గురు మహా సన్నిధానాన్ని చేరువ చేసింది ఈ ఛానల్. అమెరికా, లండన్, దుబాయి, కువైట్ ఇలా ప్రపంచం నలుమూలలా ఎక్కడున్నా గురువాక్కు తక్షణమే భక్తులకు చేర్చేందుకు తపించే శ్రీ హరినాథ్ గారి కృషి అమోఘం. "సప్తఖండ అవధాన సాహితీఝరి" పేరుతో పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నిర్వహించిన అవధాన కార్యక్రమములన్నీ ఈ యూట్యూబ్ ఛానల్ ద్వారా సాహితీప్రియుల కొరకు ప్రత్యక్షప్రసారం ఇవ్వడం జరిగింది . గురుదేవుల కాశీ యాత్ర, హరిద్వార్ యాత్ర, నేపాల్ యాత్ర, అమెరికా యాత్ర ఇలా భక్తులకు ఈ ఛానల్ ద్వారా గురువుగారి ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని, గురుబోధలను, అదేశాలను శ్రీ హరినాథ్ గారి ఆధ్వర్యవంలో యూట్యూబ్ సేవాదళం చేరవేస్తున్నారు.

**పూజ్య గురుదేవుల అనుగ్రహం తో ఈ ఛానల్ నిర్వహించడములో సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదములు**

- శ్రీ కోడె జగదీష్ గారు
- శ్రీ విశ్వనాథ్ గారు
- కీ. శే. పావని గారు
- శ్రీమతి స్నిగ్ధ గారు
- శ్రీ నవీన్ గారు
- శ్రీ అశోక్ గారు
- చిరంజీవి హరి గారు (హైదరాబాద్)
- కుమారి తేజస్వి గారు
- శ్రీ రవి కుమార్ గారు
- శ్రీ నాగరాజు గారు
- శ్రీ వసంత్ గారు
- శ్రీ జితేంద్ర ప్రతాప్ గారు

భక్తులందరూ ఈ ఛానల్ వీక్షించి, వీక్షింపజేసి ధర్మ సంస్థపాన చేయగలరు. సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు

*****

## శనైశ్చరుని దర్శనం అనంతరం కాళ్ళు కడుగుకోవాలా ?

ఏ శాస్త్రం లోనూ, ఏ పురాణంలోనూ శనైశ్చరుని దర్శనము అనంతరం కాళ్ళు కడుగుకోవాలని చెప్పలేదు. ఒక్క మందపల్లికి వెళ్ళినపుడు, లేదా శనికి తైలాభిషేకము చేయించుకున్నప్పుడు అర్చకుడు కాళ్ళు కడుగుకోవాలని చెబితే కడుగుకోవాలి. అర్చకులు గుడిలో ఉన్నంత సేపు దేవునితో సమానం.



## విద్యానిధి- శ్రీ రామ నామము

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ గురుభ్యోనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మ శ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారికి జయము

పూజ్యగురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి మనః సంకల్పం నుండి వచ్చిన కార్యక్రమం గుడి - బడి. గురుదేవుల ఆశీస్సులతో తెలుగు రాష్ట్రముల నుండే కాక అంతర్జాతీయముగా గురుభక్తులు అందరూ గుడి బాట పట్టారు. గురుదేవుల అనుగ్రహం తో అంతర్జాల వేదిక గా సామాజిక మాధ్యమములను వినియోగిస్తూ విద్యానిధి కార్యక్రమమును ప్రారంభించిన తరువాత గురుభక్తులందరూ బడి బాట కూడా పట్టారు.శ్రీ ప్రణవ పీఠం విద్యానిధి కార్యక్రమం ద్వారా అనేక బోధనా కార్యక్రమాలను ప్రారంభించారు శ్రీ కోడె జగదీష్ గారు.శ్రీ జగదీష్ కోడె గారి సూచనలతో శ్రీమతి లక్ష్మి శ్రీపాద గారి ఆధ్వర్యవంలో శ్రీ ఆదిత్య శర్మ, శ్రీ గోపిచంద్ సహకారం తో జ్ఞానమాధుర్యం, వేదగణితం,కథామృతం ఇలా అనేక కార్యక్రమాలను శ్రీ ప్రణవ పీఠం శిష్యబృందం అంతర్జాల వేదిక పై ఉచితంగా నిర్వహిస్తోంది.విద్యానిధి ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ఒకటి జ్ఞానమాధుర్యం, ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు తెలుగు పద్యాలు, భగవద్గీత వంటివి నేర్పుతున్నారు.నేటి బాలలే భవిష్యత్తు లో సనాతన ధర్మమునకు వారధులు. అందువల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీ రాముడు గురించి తెలియని వారు సనాతన ధర్మము లో ఉండరు. శ్రీ రాముడు ఆదర్శ పురుషుడు,శ్రీ రామ నామమే జనులకు రక్ష.పిల్లల చేత శ్రీ రామ నామం చేయించటం అంటే రాముడి ఆదర్శ భావాలను పాటించమని తెలియజేయటమే. పిల్లల్లో సంస్కారం, సమయపాలన, నిజాయతి వంటివి పెంపొందించే క్రమంలో జ్ఞానమాధుర్యం పిల్లల చేత గురుపూర్ణిమ నాడు శ్రీ రామ నామం రాయించే కార్యక్రమానికి శ్రీకారం జరిగింది. భక్తి శ్రద్దలతో పాల్గొన్న ప్రతి చిన్నారికి భద్రాచలం నుండి రామ మాడలను గురుదేవుల ఆశీస్సులతో అందించటం జరిగింది.పిల్లలకైనా పెద్దలకైనా, సన్యాసులకైన, గృహస్తులకైనా రామ తత్త్వమే ఏకైక మార్గం.బాల బాలికలు అందరూ ఉత్సాహంగా పాల్గొని రామ నామమును రాసారు. గురుకృప తో విద్యార్థులందరికీ విద్యా బుద్ధులు కలగాలి.

శ్రీ రామ నామ యజ్ఞ కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన రామ దండుకు ప్రత్యేక ధన్యవాదములు

- శ్రీమతి సత్యగారు
- శ్రీమతి మౌనిక గారు
- శ్రీ జానకిరామ్ గారు
- శ్రీ కోడె జగదీష్ గారు
- శ్రీమతి లక్ష్మి శ్రీపాద గారు
- శ్రీ ఆదిత్య శర్మ గారు
- శ్రీ గోపిచంద్ గారు
- శ్రీ అశోక్ గారు
- శ్రీ జితేంద్ర ప్రతాప్ గారు
- శ్రీ నరసింహ రావు గారు
- శ్రీమతి లలిత గారు

శ్రీ రామ నామము చేయండి చేయించండి.సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు

*****



## శ్రీ వేంకటేశ్వర విలాసం పారాయణ

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ గురుభ్యోనమః

నమో వేంకటేశాయ

పూజ్యగురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు అందించిన దివ్యపారాయణ గ్రంథం శ్రీ వేంకటేశ్వర విలాసము. శ్రీ వేంకటేశ్వర విలాసమును ముప్పై అధ్యాయములతో అందించారు పూజ్య గురుదేవులు. శ్రీనివాసుడి లీలావైభవం, కళ్యాణ మహోత్సవము, వ్యూహ లక్ష్మి వైభవం వంటి దివ్య కథలు అన్నీ అందించారు గురుదేవులు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు పుస్తక రూపం లో ఉంటే అది శ్రీ వేంకటేశ్వర విలాసం.గురుదేవులు అందించిన ఈ గ్రంధాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న గురుభక్తులు ప్రతి శనివారం శ్రీమతి జ్యోతి గారి ఆధ్వర్యంలో సామూహిక పారాయణ చేస్తున్నారు. రేపల్లె లో వకుళ కిట్టీ అను మహిళా సత్సంగం ఏర్పాటు చేసుకున్నారు గురుభక్తులు. శ్రీ వేంకటేశ్వర విలాసం పారాయణను ఏకాహ దీక్షతో పారాయణను ఇప్పటి వరకు 25 వారాలు నిర్విఘ్నంగా జరుపుకున్నారు.శ్రావణ మాసం సందర్భంగా ప్రతి రోజు,రోజుకి ఒకరింట్లో 30 రోజులు లలితా సహస్ర నామ పారాయణం , శ్రీ వేంకటేశ్వర విలాసం పారాయణ (రోజు ఒక అధ్యాయం )చేయాలని మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీ పొన్నూరు గౌరీ రామ కుమారి గారు గురుదేవుల అనుగ్రహం తో సంకల్పించారు అందుకు ప్రెసిడెంట్ యామిని కృష్ణ గారు, ట్రెజరర్ గారు,సెక్రెటరీ గారు కూడా సమ్మతించారు. ఈ పారాయణ తో పాటు 5 శనివారాల శ్రీ వేంకటేశ్వర విలాసం ఏకాహ పారాయణను కూడా రేపల్లె మహిళా మండలి సామూహికంగా నిర్వహించబోతున్నారు.




శ్రీగురు కృపతో, శ్రీనివాసుడి కృప తో ,రేపల్లె వాసుల స్ఫూర్తి తో గురుభక్తులు అందరూ శ్రావణ మాసం లో శ్రీ వేంకటేశ్వర విలాస పారాయణను చేద్దాం చేయిద్దాం.

★★★★★

